నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 27 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 12 వేలు ఇవ్వాలి

- ఏవోకు వినతిపత్రం అందజేత

కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం ఇస్తున్న ఆటో జేఏసీ నాయకులు

నస్పూర్, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో గిరాకీలు లేక రోడ్డున పడ్డామని, కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నామని, ప్రభుత్వం ప్రతినెలా రూ. 12 వేలు చెల్లించి ఆదుకోవాలని ఆటో యూనియన్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రాజేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, మధుకర్, షఫీ, రాజు, రాంబాబు, హబీబ్, వెంకటేశ్, అంజయ్య, ఖలీమ్, మహేశ్, సత్యం, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

- చెన్నూర్ అటవీ రేంజ్ అధికారి శివకుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రేంజ్ అధికారి శివకుమార్

చెన్నూర్, ఏప్రిల్ 26 : చెన్నూర్ ప్రాంత అడవుల్లోనూ ఏనుగులు సంచరించే అవకాశ ముందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని చెన్నూర్ అటవీశాఖ రేంజ్ అధికారి శివకుమార్ అన్నారు. శుక్రవారం చెన్నూర్ పట్టణంలోని అటవీశాఖ కార్యాల యంలో 'మానవ-ఏనుగు-సంఘర్షణ' అనే కార్య క్రమంలో భాగంగా ఏనుగులు సంచరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏనుగులు వస్తే ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు తమకు వెంటనే సమాచారమివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్‌శాఖ, పశు వైద్యశాఖ, రెవెన్యూశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- జిల్లా సైన్స్ కేంద్రంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 26 : ప్రకృతిలోనే అనేక ఆవిష్కరణలుంటాయని, పరిశీలిస్తే సమస్యలు పరిష్కరించే ఆవిష్కర్తలుగా విద్యార్థులు ఎదుగుతారని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా సైన్స్ అధికారి అధ్యక్షతన 15 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని, విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ సెంటర్‌కు అనుబంధంగా జిల్లా సైన్స్ మ్యూజి యం, పార్కు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గురుత్వాకర్షణ శక్తి గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, రిసోర్స్ పర్సన్ జాకీర్ హుస్సేన్, తిరుపతి, రాజేశం, ఉపాధ్యాయులు కృష్ణ, కుమార్, హరి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 26 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే 2వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్, పదోతరగతి పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఆయా చోట్ల 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఆయనవెంట డీఈవో యాదయ్య ఉన్నారు.

బడా వ్యాపారి కావాల్నా.. ప్రజా సేవకుడా..

- ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- కారు గెలిస్తేనే ప్రజలందరికీ మేలు
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- దేవాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి విస్తృత ప్రచారం

కాసిపేట : దేవాపూర్‌లో ర్యాలీగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, ఏప్రిల్ 26 : చుట్టుపు చూపుగా వచ్చిపోయే బడా వ్యాపారి (కాంగ్రెస్ అభ్యర్థి) కావాల్నో.. నిత్యం అందుబాటులో ఉండే సేవకుడు కావాల్నో ప్రజలే నిర్ణయించుకోవాలని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్ మేజర్ గ్రామ పంచాయతీలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఓరియంట్ కంపెనీ కార్మికులను నేరుగా కలిసి మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు మనకు ఎంతో ప్రతిష్టాత్మకమని, మన అందరి క్షేమం కోసం బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కార్పొరేట్ వ్యాపారి అని, వారికి ప్రజా సమస్యలు పట్టించుకునే తీరిక ఉండదని, దీనిని ప్రజలంతా గమనించాలని కోరారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బంగారంలాంటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామని ప్రజలంతా బాధపడుతున్నారన్నాని గుర్తు చేశారు. బీఆర్ఎస్ గెలిస్తేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. బీఆర్ఎస్ సర్కారులో అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేశామని, కాంగ్రెస్ మాత్రం ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీతో పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఓసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచులు ఆడె జంగు, ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాస్‌దేవ్, దండవేణి చందు, కైలాస్, వడ్లూరి మల్లేశ్, ఏనుగు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూర్‌లో ఇంటింటా ప్రచారం

చెన్నూర్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పట్టణంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 4,5వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను వివరించారు. బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్ రెవెల్లి మహేశ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, నాయకులు రాంలాల్ గిల్డా, మేడ సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్, కొండపర్తి వెంకటరాజం, ఆరిఫ్, ముత్యాల సత్యవతి, భారతి పాల్గొన్నారు.

చెన్నూర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- దండేపల్లి మండలంలో ఇంటింటా ప్రచారం

దండేపల్లి, ఏప్రిల్ 26 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోసపూరిత కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం దండేపల్లి మండలంలోని ధర్మరావు పేట, పెద్దపేట, గుడిరేవు గ్రామాల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏ కష్టమొచ్చినా మీ ముందుంటానని, కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

పెద్దపేటలో ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

- కేసీఆర్ సర్కారు చేపట్టిన పథకాలు, అభివృద్ధిని గడప గడపకూ తీసుకెళ్లాలి
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి
- జైనూర్‌లో ఐదు మండలాల బూత్‌స్థాయి నాయకులకు సమావేశం
- పాల్గొన్న ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

జైనూర్, ఏప్రిల్ 26 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాలేజ్‌గూడలో ఐదు మండలాల బీఆర్ఎస్ బూత్ స్థాయి నాయకులకు నిర్వహించిన సమావేశానికి ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కేసీఆర్ సర్కారులో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గడపగడపకూ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు, సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు, బూత్‌స్థాయి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. ఆసిఫాబాద్ ప్రాంతానికి మొదటిసారిగా ఎంపీ అవకాశం వచ్చిందని, ప్రజలు ఆలోచించి పార్టీలకతీతంగా తనను ఆశీర్వదిస్తే అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ యూనుస్ అక్బానీ, జైనూర్ ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆత్రం భగవంతరావు, జాదవ్ శ్రీరామ్ నాయక్, జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, నార్నూర్, గాదిగూడ మండలాల, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సహకార చైర్మన్లు పాల్గొన్నారు.

అంతా సిండికేట్..

- కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇష్టారాజ్యంగా వైన్స్‌ల నిర్వహణ
- ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయం
- గూడెంలోని వైన్స్ నిర్వాహకులను నిలదీసిన మందుబాబులు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- 'మామూలు'గా తీసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు

వైన్స్‌లో అధిక ధరలకు మద్యం అమ్మిన వ్యక్తిని నిలదీస్తున్నప్పటి వీడియో క్లిప్పింగ్

మంచిర్యాల ప్రతినిధి/కాగజ్‌నగర్, ఏప్రిల్ 26 : కాగజ్‌నగర్ డివిజన్‌లోని వైన్స్‌ల నిర్వాహకులు సిండికేట్‌గా మారి మద్యం ధరలు పెంచేసి విక్రయిస్తున్నా, ఎక్సైజ్‌శాఖ అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. బీర్‌పై ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.180 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నా పట్టించుకోవడం లేదు. చింతలమానేపల్లి మండలం మహారాష్ట్ర బార్డర్‌కు సమీపంలోనున్న గూడెంలోని ఓ వైన్స్‌లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడంపై మందుబాబుల నిలదీయగా, ఆ వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇదే వైన్స్‌పై స్థానిక యువకులు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఆ సమయంలో వైన్స్‌షాప్ నిర్వాహకులు రెచ్చిపోవడం గమనార్హం. 'ఎవ్వరికి ఎంత ఇవ్వాలో అంత ఇస్తున్నాం. ఎవ్వరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. మా ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతాం' అని వారు బాహాటంగానే చెప్పారంటూ బాధితులు తెలిపారు. మహారాష్ట్ర పక్కనే ఉన్న ఈ వైన్స్‌షాప్‌లో మద్యానికి డిమాండ్ ఎక్కువ. చాలా మంది ఆ రాష్ట్రం వాళ్లు ఇక్కడికి వచ్చి మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అందుకే అధిక ధరలకు అమ్మడం పరిపాటిగా మారిందని స్థానికులు అంటున్నారు. వైరలైన వీడియోపై షాపు యాజమానిని ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఇల్లీగల్ వ్యాపారానికి సహకారం

వైన్స్‌షాపుల్లో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం అమ్మడంతో పాటు బెల్ట్‌షాపులను ప్రోత్సహించడం ఎక్కువైపోయింది. కొన్ని వైన్ షాపుల్లో లభించని మద్యంబ్రాండ్లు బెల్ట్‌షాపుల్లో దొరుకుతున్నాయి. మద్యం ప్రియులు ఇదేమని అడిగితే.. ఉన్న స్టాక్ మొత్తం బెల్ట్ షాపుల నిర్వాహకులు తీసుకెళ్లారని. మేమేం చేయాలని.. చెప్పడం విస్మయానికి గురి చేస్తున్నది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కొన్ని మండలాల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ నామమాత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైన్స్ షాపులు, బెల్ట్ షాపుల్లో తనిఖీలు చేయాల్సి వస్తే ముందస్తు సమాచారం ఇచ్చాకే.. అధికారులు అక్కడికి వెళ్తారని.. అంతా పకడ్బందీగా ఇల్లీగల్ వ్యాపారానికి సహకరిస్తారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదులు అందినా..

కాగజ్‌నగర్ డివిజన్‌లోని కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లో సిండికెట్ మద్యం వ్యవహారం కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక మద్యం వ్యాపారి కొన్ని మండలాలను కలిపి సిండికేట్ చేసి ఈ వైన్స్‌లు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. సిండికేట్ కావడంతో ప్రతి మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా దండుకుంటున్నారు. ఈ విషయమై గతంలో ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవలే కాగజ్‌నగర్‌లో ఒక మద్యం దుకాణంలో కల్తీ మద్యం దొరికింది. ఎప్పుడైనా రాష్ట్ర స్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వచ్చి తనిఖీ చేసి కల్తీ మద్యం పట్టుకుంటే తప్ప...ఇక్కడి అధికారులతో అది సాధ్యం కాదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వైన్స్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం
కిరణ్‌జ్యోతి, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

గూడెం వైన్స్ షాపులో అధిక ధరలకు మద్యం అమినట్లు వీడియో వైరల్ అవుతోంది. విచారణ కోసం మా ఎస్ఐని పంపించాం. అక్కడికి వెళ్లి వచ్చేందుకు చాలా సమయం పడుతుంది. మా అధికారి వచ్చాక నిజానిజాలు నిర్ధారణ చేసుకుంటాం. ఈ ఘటనపై విచారణ జరిగి తదుపరి చర్యలు తీసుకుంటాం.

కాంగ్రెస్‌లో లొల్లి

- మహేందర్‌రావు, ఆయన అనుచరుల చేరికను వ్యతిరేకించిన నాయకులు
- ఎమ్మెల్యే వినోద్, ఎంపీ అభ్యర్థి ఎదుటే బహిర్గతమైన విభేదాలు
- ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం

మహేందర్‌రావు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

తాండూర్, ఏప్రిల్ 26 : మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. తాండూర్‌కు చెందిన సీనియర్ నాయకుడు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్‌రావు, తన అనుచరులతో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేసుకున్నాడు. ఈ విషయమై ఎమ్మెల్యే వినోద్‌కు ముందే సమాచారమిచ్చాడు. కిష్టంపేట, తాండూర్ ఐబీలో రోడ్ షో పూర్తి చేసుకున్న ఎమ్మెల్యే వినోద్, నాయకులు వేణుగోపాలాచారి, పురాణం సతీశ్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ నాయకులతో కలసి తాండూర్‌కు చేరుకున్నారు. తన ఇంటివద్ద మహేందర్‌రావు, ఆయన సతీమణి, మాజీ సర్పంచ్ ఉమారాణి, ఇతర నాయకులు మంగళహారతులతో వినోద్‌కు స్వాగతం పలికేందుకు రాగా, ఒక్కసారిగా మరోవర్గం నాయకులు వ్యతిరేక నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మహేందర్‌రావును, ఆయన అనుచరులను పార్టీలో చేర్చుకోవద్దంటూ ఆందోళనకు దిగారు. ఇంతలోనే మహేందర్‌రావు వచ్చి తమను పార్టీలో ఎందుకు చేర్చుకోరంటూ ప్రశ్నించాడు. దీంతో ఆయనను స్వాగతించే వర్గం, వ్యతిరేకించే వర్గం మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరకు ఎవరినీ పార్టీలో చేర్చుకోకుండానే నాయకుల వాహనాలు వెనుదిరిగాయి. ఆపై మరోచోట సమావేశం కాగా, అక్కడ కూడా ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. చివరకు ఘర్షణకు దారి తీయగా పోలీసుల జోక్యం అనివార్యమైంది. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యేగానీ, అభ్యర్థిగానీ నోరు మెదపకపోవడం గమనార్హం. కొంత మంది స్వార్థం కోసం తన చేరికను అడ్డుకుంటున్నారని, ఇది పార్టీ అభ్యర్థి గెలుపోటములపై ప్రభావం చూపుతుందని మహేందర్‌రావు పేర్కొన్నారు.

నైరాశ్యంలో క్యాడర్...

తాండూర్‌లో చోటుచేసుకున్న గొడవకు ముందే తాండూర్ ఐబీ వద్ద రోడ్‌షోలో స్థానిక నాయకుల మధ్య ఆధిపత్య పోరు కనిపించింది. కిష్టంపేట, తాండూర్ ఐబీ, బోయపల్లి, కొత్తపల్లి, మాదారంకు చెందిన పలువురు పార్టీలో చేరాల్సి ఉండగా, వారిని కలువకుండా, చేరికలు లేకుండానే ఎమ్మెల్యే ప్రచార వాహనం తాండూర్ గ్రామానికి వెళ్తుండడంతో ఆయా గ్రామాల నాయకులు నిరాశ పడ్డారు. ఒకరిద్దరు నాయకుల మాటలు విని ఇక్కడ చేరికలు, రోడ్‌షో నిర్వహించకుండానే తాండూర్ వెళ్లడంపై తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లిబుచ్చారు. దీంతో చాలా మంది నాయకులు ప్రచారానికి వెళ్లలేదు.

మామిడి రైతుకు నిరాశే..

- వాతావరణ పరిస్థితులు అనుకూలించక తగ్గిన దిగుబడి
- ఎకరాకు టన్ను కూడా కష్టమే
- రోజు రోజుకూ పడిపోతున్న ధరలు
- దిగాలు పడుతున్న కర్షకులు

మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న వ్యాన్

నెన్నెల, ఏప్రిల్ 26 : కోటి ఆశలతో మామిడి సాగు చేసిన రైతాంగానికి చివరకు నిరాశే మిగిలింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి భారీగా తగ్గగా, ఉన్న కాస్త పంటనైనా అమ్ముకుందామనుకుంటే మార్కెట్‌లో ధరలేక దిగాలుపడుతున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ యేడాది దాదాపు 24 వేల హెక్టార్‌లలో మామిడి సాగయ్యింది. ప్రస్తుతం కోతలు మొదలయ్యాయి. యేటా సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుండగా, ఈ యేడాది వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి భారీగా తగ్గే అవకాశముంది. పూత ఆలస్యంగా రావడంతో పాటు తెగుళ్లు సోకడం.. కొంతమేర కాత నిలిచినప్పటికీ గాలి వానలకు పంట నేల రాలిపోవడం వంటి కారణాలతో దిగుబడి తగ్గుతుందని, ఎకరానికి కనీసం టన్ను కాయ కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశ.. నిరాశ.. తగ్గిన ధర

ఈసారి మామిడి దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని ఆశించిన రైతులు, వ్యాపారులకు చివరకు నిరాశే మిగిలింది. ఇక్కడి రైతులు మాహారాష్ట్రలోని నాగపూర్ ఫ్రూట్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. పంట కోసి వందల కిలో మీటర్లలో ఉన్న మార్కెట్‌కు తరలిస్తే.. అక్కడ దళారుల చేతుల్లో మోసపోవాల్సి వస్తున్నది. ఇక కొందరు వ్యాపారులైతే నేరుగా తోటల వద్దకే వచ్చి రైతులను మచ్చిక చేసుకొని తమ హడ్డి వద్దకు తీసుకురావాలని, మంచి ధర వస్తుందని నమ్మబలుకుతున్నారు. రైతుల ముందే ఫోన్‌లో మాట్లాడినట్లు నటించి.. ధర మంచిగుందని నమ్మిస్తున్నారు. తీరా దళారులను నమ్మి పంటను మార్కెట్‌కు తరలిస్తే క్వింటాలుకు రూ.4 వేల చొప్పున కూడా కొనడం లేదని రైతులు వాపోతున్నారు. మొదట క్వింటాలుకు రూ.8 వేల వరకు ధర పలుకగా, ప్రస్తుతం కనిష్ఠంగా రూ. 3500 మాత్రమే ఉంది. పెట్టుబడి, కోత ఖర్చులు, ట్రాన్స్‌ఫోర్టు, టోల్ ఫీజు, దళారీ కమీషన్‌వంటివి పోగా.. ఏమీ మిగలడం లేదని, తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే క్వింటాలుకు రూ.12 వేల ధర పలికిందని, చివరాఖరు వరకు రూ.5 వేల దాకా ధర ఉందని వారు పేర్కొంటున్నారు. ఇక మామిడిలో అధిక డిమాండ్ ఉంటుందనుకున్న దసేరికి కూడా ఈ సారి బంగెనపల్లి మామిడి కంటే తక్కువగా ధర పలుకుతుంది. దసేరికి కిలోకు రూ. 40 చొప్పున, బంగెనపల్లి రకానికి కిలోకు రూ.50 చొప్పున ధర పలుకుతుం ది. స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పిస్తే తమకు కొంత లాభముండేదని రైతులు పేర్కొంటున్నారు.

మబ్బులతో ఆందోళన

అంతంత మాత్రంగా కాసిన మామిడి పంట చేతికొస్తున్న తరుణంలో మబ్బులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్లకు మామిడి నేలరాలిన విషయం విదితమే.. ఉన్నకాస్త పంటనైనా అమ్ముకుందామనుకుంటే వానలు భయపెడుతున్నాయని వారు పేర్కొంటున్నారు.